మెలికల కడియాలు

పొద్దుట్నుంచీ కోటిగాడి వాలకం కనిపెట్టి చూస్తున్నాడు రామిగాడు. దొర సానమ్మగారికి జ్వరం. దొరగారు వూళ్లోలేడు. కోటిగాడు పొలంకేసి పోలేదు సరిగదా, ఆఖరికి ఇంటిక్కూడా వెళ్లొచ్చినట్టులేదు. కాట్లకుక్కలా కనపడిన జీతగాళ్లందరినీ నానా కూతలూ కూస్తున్నాడు.

అసలే ముచ్చుముఖం. అందుకుతోడు పొద్దుట్నుంచీ దొంగచూపులు చూస్తున్నాడు. తను రెండు సంవత్సరాల్నుంచీ గుట్టుగా దాచిన రహస్యం కాస్తా గ్రహించేశాడా అన్న అనుమానంకూడా కలిగింది రామిగాడికి.

సూర్యాస్తమయానికి ఇంక అట్టేకాలం పట్టదు. తను యివ్వాళ పనులన్నీ చకచకా ముగించాడు. ఇక పాడిగేదెలు రెంటికీ ఇంత కుడితి పెట్టటంతో తన పని ముగుస్తుంది. తరవాత సరాసరి భద్రాచారి దుకాణానికి. ఆ తరవాత....

ఆ సంగతి వూహకందినప్పుడల్లా రామిగాడి శరీరం పులకరిస్తోంది. హృదయం ఆనందంతో పరవశమౌతోంది. మనస్సు గాలిలో అలా తేలిపోయి, రెండు సంవత్సరాల కిందట తను పొందిన అనుభూతిని తీరుగా ఆకట్టుకుంటోంది.

నాలుగు చేటల తవుడు గబగబా కుడితి గాబులో పోశాడు రామిగాడు. రెండు చేతుల్నీ గాబులో పెట్టి నీళ్ళలో కలిసీ కలవకుండావున్న తవుడును గిరగిరా తిప్పసాగాడు. సుడులు తిరుగుతూ అలల రూపంలో అంచుల కెగబాకుతున్న గాబులోని నీటిలాగే, అతడి మనస్సుకూడా భద్రాచారి దుకాణాన్నీ, తను కొనబోయే మెలికల కడియాల్ని అంది పుచ్చుకుంటోంది.

కోటిగాడు వచ్చాడు. అల్లంత దూరాన నుంచుని రామిగాణ్ణి నఖశిఖ పర్యంతం గుచ్చిగుచ్చి చూశాడు. రామిగాడు ఇదేమీ గమనించే స్థితిలోలేడు... తన ఆలోచనల్లో... రెండు సంవత్సరాల శ్రమ ఫలితంగా, ఫలించిన తన ఆలోచనల్లో అతడు ఉండిపోయాడు.

"ఏంరోయ్, బలే వుసార్‌లో వున్నావ్!" అన్నాడు కోటిగాడు.

"ఏహెహెఁ - ఏం లేదు" అనేశాడు రామిగాడు, వులిక్కిపడి తలెత్తుతూ.

"మాణిక్కాం తొందరగా రమ్మదేందిరా?" అన్నాడు కోటిగాడు, అదే దొంగచూపుతో.

"అదేం కాదులేవోయ్! ఇయ్యాల..." నాలిక్కొరుక్కున్నాడు రామిగాడు.

"అసలు సంగతేం దశ! నామీద నమ్మకం లేదా?"

"ఊఁ" అని మూలిగాడు రామిగాడు. అంతలోనే వళ్ళుమరచిన వుత్సాహంతో

"ఆc - ఏం లేదు. మా ఆడదానికి మెలికల కడియాలంటే మా చెడ్డ సరదా. పెల్లయి నప్పటినుంచీ కొనిద్దామంటే డబ్బు పిగల్లేదు... ..."

"అయితే ఇయ్యాల కొనబోతూ వుండావన్నమాట!"

మధ్యలోనే అందుకుని గుచ్చి గుచ్చి చూస్తూ అడిగాడు కోటిగాడు.

కోటిగాడు చూపుల్లో 'నీకింత డబ్బు ఇవ్వాళ ఎక్కడినుంచి వచ్చింది?' అన్న ప్రశ్న ద్యోతకమవుతూంది. కండ్లకొనల్లోంచి ఈర్ష్య తొంగిచూస్తోంది.

రామిగాడి మనస్సు చివుక్కుమన్నది. కోటిగాడూ, తనూ దాదాపు పది సంవత్స రాలనుంచి బుచ్చయ్యగారి పనిలో వుంటున్నారు. తనను చూస్తే యెందుకో కోటిగాడికి ఎప్పుడూ కోపమే. తనకు పెళ్ళయిన ఈ రెండు సంవత్సరాలనుంచీ ఆ కోపం చాలా విజృంభించింది. మరీ ఈ పొద్దుట్నుంచి కారాలు మిరియాలు నూరుతున్నాడు.

తనమీద కోటిగాడికి యింత పగ ఎందుకో, యెంత ఆలోచించినా రామిగాడికి అర్థం కాదు. '...ఇయ్యాల కొనబోతుండావన్నమాట!' అన్న కోటిగాడి మాటల వెనకవున్న ద్వేషం రామిగాడ్ని కలతపెట్టింది. ఆ పక్కనే నుంచుని కోటిగాడు ఇంకా విషపు నవ్వు నవ్వుతూనే వున్నాడు. వాణ్ణి వదిలించుకోవడం ఎట్లా?

కొంచెం చీదరించుకుంటూనే అన్నాడు రామిగాడు-

'ఏడాదినుంచీ అణాలూ, బేడలూ దాచి, ఎట్టయితేం కడాలు కొనేందుకు సరిపడే డబ్బు కూడబెట్టాలేవోయ్!"

ఆ తరవాత ఇక అక్కడ నుంచోలేదు. కుడితిగాబులోంచి చేతులు బయటికి తీసి, మోచేతులవరకూ అంటివున్న తవుడును విదిలించుకుంటూ, గొడ్లచావిడి వేపుకు వెళ్ళిపోయాడు.

రోజూ రాత్రి ఎనిమిది గంటలవరకూ తెమలని పనిని ఈరోజు ఆరుగంటలకే ముగించాడు రామిగాడు. దొరసానమ్మగారితో వెళ్తున్నానని చెప్పి, సరాసరి భద్రాచారి దుకాణంకేసి బయలుదేరాడు.

ఈరోజు అతడి మనస్సు ఆనందంతో వురవళ్ళు, పరవళ్ళు తొక్కుతోంది. ఆలోచిస్తున్నాడు. ఇవ్వాళకూడా భద్రాచారి తననిచూసి ముఖం చిట్లించుకుంటాడు. రోజూ తను చేతులు నలుపుకుంటూ ఒక్కసారి ఆ మెలికల కడియాలు చూపించమని అడిగేవాడు. విదిలించి సదిలించి అతను వాటిని చూపించేవరకూ వదిలేవాడుకాదు.

భద్రాచారి రోజూ తనకేసి 'ఎక్కడిదీ శనిగ్రహం' అన్నట్టు చూసేవాడు. కాని ఇవ్వాళ... దర్జాగా రొంటినున్న సంచీలోంచి రూపాయలు తను బయటికి తీస్తాడు. ఒకటి... రెండు... మూడు... మొత్తం ముప్పై ఆరు రూపాయిల్ని ఖంగుమనిపిస్తూ భద్రాచారి చేతుల్లో పోస్తాడు.

అప్పుడు చూడాలి భద్రాచారి చత్వారపు కళ్ళజోడు! బహుశా ముక్కుమీదికి జారిపడే కళ్ళజోడు మరోమారు తుడిచి పెట్టుకుంటాడు. ఇంతకాలంనుంచి తనను తేలిగ్గా చూసినందుకు విచారిస్తాడు. తను మాత్రం డబ్బు అవతల పారేసి ఆ మెలికల కడియాల్ని తీసుకుని గుట్టు చప్పుడుగా వచ్చేస్తాడు.

రామిగాడు భద్రాచారి కొట్టుముందుకు వచ్చేశాడు. భద్రాచారి తల వంచుకుని కొలిమి వూదుకుంటున్నాడు. పల్లెటూరి జనంకూడా, బస్తీల్లోనే నగలు చేయించడం నేర్చిం

తరవాత, భద్రాచారికి దినం గడవటమే కష్టంగా వుంటున్నది. మరీ ఒక నెలనుంచి చేతిలోకి చిల్లిగవ్వ రాలేదు. ఒక మెలకల కడియాల జత తయారై సిద్ధంగా వుంది. అదన్నా అమ్ముడుపోతే-కాస్త డబ్బు చేతిలో మెదులును. నెల రోజులనుంచి రామిగాడు రోజూ, రేపు తప్పక కొంటాను, ఎవరికీ ఇవ్వద్దని ఒక్క పొద్దులు చెబుతున్నాడు. రోజూ వచ్చి ఒకసారి చూపించేంతవరకు విసిగించి మరీ పోతాడు.

రామిగాడి అమాయకత్వం చూస్తే భద్రాచారికి జాలి కలుగుతుంది. తనకోసమే ఆ మెలికల కడియాలు అట్టి పెట్టాడనుకుంటాడు. అందుకే తనూ ఏదో వాణ్ణి కని కరిస్తున్నట్లు ప్రవర్తిస్తాడు.

కాళ్ల చప్పుడు విని భద్రాచారి, కొలిమిలో గొట్టాన్ని అలాగే వుంచి తలెత్తి చూశాడు. ఎదురుగా రామిగాడు. అంతవరకూ వాణ్ణి గురించే ఆలోచిస్తున్న భద్రాచారికి, వాడి ఆకారం చూసేసరికి వళ్ళు భగ్గుమన్నది. రోజూ ఇదే నాటకం అనిపించింది.

“వచ్చావా, నా ప్రాణం తియ్యటానికి! కడియాలూ లేవు గిడియాలూ లేవు. పోపో, వచ్చావు మహాకొనేవాడివి!” అనేశాడు భద్రాచారి గుడ్లెర్రచేస్తూ.

రామిగాడికి, భద్రాచారి ఈసడింపేమీ బాధ కలిగించలేదు. అతనేమంటాడో ముందే తెలుసుగనక, గంభీరంగా ఓ చిరునవ్వునవ్వి, రొండిన కట్టుకున్న రూపాయల సంచిని గబగబా వూడదీశాడు.

భద్రాచారి గతుక్కుమన్నాడు. రామిగాడి కళ్లు విజయగర్వంతో మెరుస్తున్నాయి. బహుశా విశ్వవిజేత అని పేరుగాంచిన సికిందర్‌కూడా, ఏ దేశాన్ని జయించినప్పుడూ అంత ఆనందం, అంత ధీమా, అంత విజయగర్వం అనుభవించి ఉండడు.

ఒక్కొక్కటే లెక్కపెడుతూ ముప్ఫై ఆరు రూపాయిలూ భద్రాచారి చేతుల్లో పోశాడు రామిగాడు. కాని, రామిగాడు వూహించినట్టు, భద్రాచారి చత్వారపుకళ్లు ఆశ్చర్యంతో మెరవలేదు సరికదా, కనీసం రోజూ తన్ను అంత చులకనగా చూసినందుకు పశ్చాత్తాపాన్నికూడా కనబరచలేదు.

తనకు వూరికేనే యిస్తున్నట్టు ఆ కడియాల జతను చేతుల్లో పెట్టి, కిక్కురుమన కుండా డబ్బు మరోసారి లెక్కపెట్టుకుంటూ ఇంట్లోకి వెళ్ళిపోయాడు. రామిగాడికి ఆ నిమిషాన వీలుంటే భద్రాచారిని నమిలి మింగుదామా అన్నంత కోపం వచ్చింది.

రామిగాడు తిరిగి యింటివైపుకు నడుస్తున్నాడు. రెక్కలుంటే ఎగిరిపోయి వుండును. గాలిలో తేలిపోతున్నాడు. రోజూలాగానే మాణిక్యాం యీరోజూ బుంగమూతిపెట్టి కూర్చొని వుంటుంది. కొద్దిరోజులనుంచి తనను ఎందుకూ పనికిరాని దద్దమ్మకింద కట్టేసింది. మరి యీ రోజు...? తనకు తెలియకుండానే చేయి బొడ్లో దాచివుంచిన కడియాలమీదికి పోయింది. ఆడదాని దృష్టిలో ఒక్కసారి మగవాడు తేలిక అయాడా, వాళ్ళను పుట్టించిన బ్రహ్మతరంకూడాకాదు, ఆ అభిప్రాయం మార్చడానికి. కాని అమాయకుడైన రామిగాడికేం తెలుసు ఆ విషయం; కడియాలు చూసి తన్ను ఆనందంతో అమాంతం కావిలించు కుంటుందనుకున్నాడు.

రామిగాడికి చిన్నప్పుడే తల్లి తండ్రీ కరువయారు. మేనమామ యింట్లో పెరి గాడు. పెరగటమంటే పది సంవత్సరాలనుంచి బుచ్చయ్యగారి యింట్లో రెక్కలు ముక్కలయేలాగ బండచాకిరి చేస్తే నెలకు పది రూపాయల జీతం యిచ్చేవారు. అవి

అల్లారుముద్దుగా తెచ్చి అత్త చేతిలో పోస్తే ముక్కు విరుస్తూ, మూతి విరుస్తూ ప్రొద్దునపూట యింత గంజి పోసేది. మళ్ళీ రాత్రిళ్లు బుచ్చయ్యగారి యింట్లోనే అన్నం తినేవాడు.

రామిగాడికి పెండ్లయి రెండు సంవత్సరాలయినా భార్య కాపరానికి వచ్చి ఆరు నెలలు మాత్రమే అయింది. ఈ ఆరునెలల్లో భార్యను మెప్పించగలిగే ఏ పనీ చేయలేకపోయాడు. ఆలోచిస్తూ నడుస్తున్నాడు రామిగాడు. కళ్ళముందు నల్లగా నిగనిగలాడే బొద్దుపాటి కాళ్ళూ-ఆ కాళ్ళకు తెల్లని వెండి మెలికల కడియాలు కన్పిస్తూ, తనను త్వరగా నడవమని కవ్విస్తూ, మధ్యమధ్య మాయమౌతున్నాయి. ఒక్కొక్కప్పుడు తన గుండెల్లోనే ఆ కాళ్లు నడుస్తున్నట్లున్నాయి కూడా.

తనకు కడియాలు పెట్టిన కాళ్లంటే చిన్నప్పటినుంచీ కూడ ఎంతో యిష్టం. యీమధ్య నాగరికం పెరిగి, మగ ఆడ భేదమే లేకుండా పోతోంది. మొండికాళ్ళ ఆడవాళ్ళను చూస్తే తనకు చాలా అసహ్యం. బుచ్చయ్యగారి కోడలు ఆ బంగారమ్మ మొండికాళ్ళు సన్నగా, వూసల్లాగ ఎంత అసహ్యంగా వుంటాయి? అంతకంటే తన కాళ్లే ఎంతో అందంగా వుంటాయనిపిస్తుంది!

మాణిక్యాం కాళ్ళ అందం చూసే, నల్లగా వుంటుందన్నా, పెదాలు లావుగా వుంటాయన్నా లెక్క చేయకుండా పెళ్ళిచేసుకున్నాడు.

పెళ్ళయినప్పటినుంచి ఆ కాళ్ళకు మెలికల కడియాలు పెడితే ఎంత అందంగా వుంటాయోనని వూహించుకొనే మురిసిపోయేవాడు. మాణిక్యాంతోకూడ కొనిపెడతానని చెప్పాడు. కాని ఒక ఆశపెట్టి, ఆ ఆశను తీర్చలేనివాడంత అసమర్థుడైన భర్త, భార్యల దృష్టిలో యింకొకడు వుండబోడు.

పెండ్లయిన యీ రెండు సంవత్సరాల్లో ఎంత ప్రయత్నించినా కడియాలు కొనటానికి డబ్బు పిగల్చలేకపోయాడు. మాణిక్యాం తనను యీ మధ్య పూర్తిగా అసమర్థునికింద కట్టేసింది. తను ఏ పని చెప్పినా చేయదు సరిగదా, దెప్పి పొడుపులతో ప్రాణం తీస్తోంది. కాని యీ రోజు...

చాలా వుత్సాహంతో ఈలవేస్తూ యింట్లో ప్రవేశించాడు రామిగాడు. మాణిక్యాం దొడ్లో గుడ్డలు వుతుకుతున్నది. చీర బిగగట్టి గుడ్డలు వుతుకుతూంటే ఆ నల్లని నిగనిగలాడే పాదాలు ఎంత అందంగా వున్నాయో అనిపించింది రామిగాడికి. కొంచెంసేపు అలాగే ఆ పాదాల్ని పరికిస్తూ నిలబడిపోయాడు. మాణిక్యాం రామిగాడ్నిచూసి, చూడనట్లుగానే యింకా విసురుగా గుడ్డలు వుతుకుతున్నది.

రామిగాడు సంతోషంతో “ఏమోవ్! యిట్టారా, ఒక మంచిమాట సెపుతా, నిన్నేనే! పలుకే బంగారమయిందేమే?” అంటూ వూపిరాడకుండా కేకలేశాడు.

మాణిక్యాం వళ్లు మండిపోయింది వుతుకుతున్న చీరెను దూరంగా విసిరేసి చాలా వడిగా రామిగాడివైపుకు నడిచింది. యింకొక రోజైతే రామిగాడు భయపడి వుండేవాడే కాని యీరోజు మాణిక్యాం కోపంగా వుంటేనే అందంగా కన్పిస్తుంది.

“ఏం కొంప మునిగిపోయింది? ఆ వజాన కేకలేస్తుండావు? ఏమీ చాతకాకపోయినా కేకలు మాత్రం చాతవును” అంటూ హూంకరిస్తున్న మాణిక్యాం చెయ్యిపట్టుకొని రామిగాడు చిరునవ్వుతో కూర్చోపెట్టబోయాడు. విసురుగా చెయ్యి విదిలించుకొని “నా బ్రతుకుక్కుతోడు యీ సరసాలే తక్కువ” అంటూ ముఖం చిట్లించుకొని తిరిగి వెళ్ళిపోతున్న మాణిక్యాం

చెయ్యి మళ్ళీ గట్టిగా పట్టుకున్నాడు రామిగాడు.

"ఎందుకే యింతకోపం? నీ కోసం ఏం తెచ్చానో చెప్పుకో" అన్నాడు రామిగాడు ముఖం గంభీరంగా పెట్టి.

"ఆc - తెచ్చావు ఏ అణా పౌకోడీలో, అర్ధనా పూలో" అంటూ చెయ్యి విడిపించుకోబోయింది.

రామిగాడు కొంచెం సకిలిస్తూ అన్నాడు: "నన్ను ఎంత దూడపుల్లాయికింద కట్టేశావ్? చెప్పు చూద్దాం, ఏం తెచ్చానో!"

ఈసారి మాణిక్యాం ముఖంలో కొంచెం మార్పు కన్పించింది. రాజీమార్గంలో అడిగింది: "నాకు పనుంది పోవాలి. ఆ తెచ్చిన కాసులపేరు యేదో తొరగా చూపించు" అన్నది.

మాణిక్యాం మాటల్లోని వ్యంగ్యం రామిగాడికి అంత వుత్సాహంలోనూ బాధ కలిగించింది. "కాసులపేరూ కాదు, కట్లదండా కాదు. నీ కిష్టమైన మెలికల కడియాలు తెచ్చాను" అంటూ బొడ్లో దాచిన కడియాల్ని తీసి మాణిక్యాం చేతిలో పెట్టాడు.

మాణిక్యాం కళ్ళలో తళుకులు కదిలాయి. తన కళ్ళను తనే నమ్మలేకుండా వుంది- తెల్లగా మెరుస్తున్న మెలికల కడియాలు చూస్తూంటే. రెండు మూడుసార్లు కడియాలను కిందకూ పైకీ తిప్పుతూ పరీక్ష ప్రారంభించింది. చివరకు పూర్తి నమ్మకం కలగ్గానే భర్తవంక చూసింది.

రామిగాడి పెదవులమీద చిరునవ్వు తొణికిసలాడుతున్నది. కళ్ళు మాణిక్యాంను ధీమాగా ప్రశ్నిస్తున్నాయి.

"రామిగాడంటే యేమనుకున్నావు? అలాంటి ఇలాంటి అల్లాటప్పాగా డనుకున్నావు గదూ?"

మాణిక్యాంకు అమితానందం కలుగుతున్నా, రామిగాడు ఊహించినట్టు సంతోషంతో తనను కావిలించుకోలేదు సరిగదా, కనీసం తనకు కృతజ్ఞతనైనా చూపకుండానే కడియాలను కాళ్ళకు పెట్టుకుంటున్నది. రామిగాడి అంత ఉత్సాహమూ మంచుగడ్డలా కరిగిపోయింది.

"చూశారా బాబూ, ఆ ఎండి కడియాలు!" అన్న కోటిగాడి మాటలతో రామిగాడు వెనక్కు తిరిగి చూశాడు. ఒక కాలుకు కడియాన్ని బిగించి ఇంకొక కాలుకు బిగించటంలో మునిగివున్న మాణిక్యాంకు వెన్నుమీద బలంగా చరిచినట్టయింది. పైకి తలెత్తి చూసింది. ఎదురుగా కోటిగాడు, మీసం మెలిపెడుతూ విషపునవ్వు నవ్వుతున్నాడు. పక్కనే యజమాని బుచ్చయ్యగారు వుగ్రుడై నిల్చుని వున్నాడు. ఆ పక్కనే యమదూతల్లాగా ఇద్దరు పోలీసులు చేతుల్లో లాఠీలను నిమురుతూ నించున్నారు.

రామిగాడి కిదంతా ఏమీ అర్థం కావటంలేదు. తల దిమ్మెత్తిపోయింది. తను నిలుచునివున్న భూమి తన కాళ్ళక్రిందనుంచి తప్పుకున్నట్లున్నది. కళ్లు మసక కమ్ముతున్నాయి. అవమానంతో, దుఃఖంతో చూస్తున్న మాణిక్యాం కళ్ళు రామిగాణ్ణి బెదరకొట్టాయి. తలవంచుకున్నాడు. ఆ నల్లని కాళ్ళకు వున్న తెల్లని కడియాలు! ఇంకేమీ అతని కళ్ళకు కన్పించటంలేదు.

వీపుమీద బలంగాపడ్డ లాఠీదెబ్బకు బాధగా మూల్గేడు రామిగాడు.

మాణిక్యాం పోలీసులకు అడ్డుపడుతూ ఏడుస్తున్నది. అందులో ఒకడు మాణిక్యాం కాళ్ళకు వున్న కడియాలు లాగుతుంటే రామిగాడికి లాఠీదెబ్బలవల్ల కలిగే బాధకంటే వెయ్యిరెట్లు బాధ కలుగుతోంది.

బుచ్చయ్యగారు ఏదో తిడుతున్నారు. కాని రామిగాడికి ఆ మాటలేమీ వినిపించటంలేదు. వాడు మాట్లాడే స్థితిలోకూడా లేదు. లాఠీ వంటిమీద నాట్యం చేస్తున్నది.

రామిగాడ్ని కావలించుకొని ఏడుస్తున్న మాణిక్యాంను ఒక పోలీసు వెనక్కు నెట్టాడు. పడిపోతున్న మాణిక్యాంను రెండు చేతుల్లో పట్టుకొని కోటిగాడు కొంటెగా చూస్తూ, ఒక చిలిపి నవ్వు నవ్వాడు. రామిగాడు ఒక్క వూపుతో పోలీసుల్ని విదిలించుకొని, కోటిగాడి జుట్టు పట్టుకున్నాడు. కాని వెంటనే బలంగా వీపుమీద పడ్డ లాఠీ దెబ్బతో 'అబ్బా' అంటూ కూలబడ్డాడు.

✿ ✿ ✿

రామిగాడ్ని ఆ రాత్రంతా రిమాండులో వుంచారు పోలీసులు. లాఠీ దెబ్బల బాధకంటే తను చేసిన తప్పేమిటో తెలియక బాధపడుతున్నాడు రామిగాడు. తను కొన్న మెలికల కడియాలకూ, బుచ్చయ్యగారికీ వున్న సంబంధమేదో రాత్రంతా ఆలోచించినా తెలియలేదు. కోటిగాడి పాత్ర అంతకంటే అర్థంకాలేదు.

రెండవరోజు మేజిస్ట్రేట్ కోర్టులో తెలిసింది. తను రామయ్యగారింట్లో వెండిపళ్ళెం దొంగిలించాడట. దానికి నిదర్శనంగా కడియాలుకూడా దొరికినవి కాబట్టి ఆరునెలల శిక్ష విధించారు. రామిగాడికి తన మాటల్లో ఎవరికీ నమ్మకం కలగదని తెలిసి మారు మాట్లాడలేదు.

✿ ✿ ✿

ఆరు నెలల శిక్షా యిట్టే అయిపోయింది. రామిగాడ్ని విడుదల చేశారు. సరాసరి రైలు దిగి యింటికి బయలుదేరాడు. ఈ ఆరునెలల జైలు జీవితానికీ కారణమైన సంఘటనలు ఒకటొకటే అతణ్ణి వేటగాడి కాఠిన్యంతో వెంబడిస్తున్నాయి.

తను సరాసరి యింటికెళతాడు. మాణిక్యాం తనను బాగా చూస్తుందా? తను జైల్లోవున్న ఈ ఆరునెలలలో చూసేందుకు ఒక్కసారి మాత్రం వచ్చింది. అదీ తన్ను చూట్టానికి కాదు; తనకు జరిగిన అవమానానికి నిందించటానికే! తను దొంగతనం చేయలేదని ఎంత చెప్పినా మాణిక్యాం నమ్మలేదు. అవును, ఎలా నమ్ముతుంది? చిన్నతనంనుంచి ఎంతో నమ్మకంగా, వళ్ళు దాచుకోకుండా రెక్కల కష్టం చేయించుకున్న బుచ్చయ్యగారికే తనమీద అనుమానం కలిగింది! దానికి కారణం అర్థం కావటంలేదు. అంతా కోటిగాడి ఎత్తేనేమో! బుచ్చయ్యగారికీ, ఇంకా ఆ ఇంట్లో వున్న అందరికీ తనంటే చాలా నమ్మకం, ప్రేమకూడ. నెలలకొద్దీ వూరికెళుతున్నా అమ్మగారు ఇంటిభారమంతా తనమీద వేసి నిశ్చింతగా వుండేది. సామాను గది తాళం చెవులు ఎప్పుడూ తనదగ్గరనే వుండేవి. అందువల్లే కోటిగాడికి బహుశా తనంటే కోపమేమో. ఎప్పుడూ తనకు బాధ కలిగించేలా మాట్లాడేవాడు.

తనను అంత దయగా చూసిన బుచ్చయ్యగారు ఇలా మారిపోవడానికి, కోటిగాడు కారణం కాదుగదా! ఈ అనుమానం కలగ్గానే రామిగాడి హృదయం భయంతో కంపించిపోయింది. వాడు తనను ఎందుకిలా క్రూరంగా వెంబడిస్తున్నాడు? వాడినుంచి

తప్పించుకోవటం ఎలాగ?

పువ్వులమ్మిన వూళ్లో కట్టెలెలా అమ్ముతాడు? వూళ్లో తలెత్తుకొని తిరిగే యోగ్యత యింక తనకులేదు. రేపు పొద్దుటికి మాణిక్యాంతో చాలాదూరం... ఈ ఘోరమృగాలనుంచి చాలాదూరం... వెళ్ళిపోతాడు.

ఇంటిముందు ఆగగానే రామిగాడి వళ్ళు ముచ్చమటలు పోసింది. ఇంటితడిక వేసివుంది. పైన తాటాకులు లేచిపోయాయి. ఆ ఇల్లు చూస్తేనే దాదాపు కొద్ది నెలలనుంచి మానవమాత్రులెవరూ నివసిస్తున్నట్లు లేదు.

రామిగాడు ఇంటిముందు మట్టిలోనే కూలబడ్డాడు. తన మాణిక్యాం ఏమయినట్లు? వియోగదుఃఖంతో మరణించిందా? లేక తిండికి జరక్క ఎటైనా పోయిందా? ఆపైన ఆలోచించలేకపోయాడు. 'మాణిక్యాం!' అంటూ పెద్దగా ఒక కేకపెట్టాడు. బిగ్గరగా ఏడవ బుద్ధి అవుతోంది.

కొంతసేపటికి తేరుకుని తన ఆలోచనలకు తనే సిగ్గుపడ్డాడు. తను అలా ఎందుకు శకునిపక్షిలాగ అనుకోవాలి? పుట్టింటికి పోయి వుండకూడదూ?

ఇంతలో ఎవరిదో పదధ్వని రామిగాడి చెవులబడింది. వెనక్కు తిరిగి చూశాడు. బుచ్చయ్య!

"నీకు చాలా అన్యాయం చేశారా, రామిగా!" అన్నాడు బుచ్చయ్య. ఆయన కళ్ళల్లో దయ వుట్టిపడుతోంది.

రామిగాడు జవాబు చెప్పలేకపోయాడు. ఏదో గొంతుకు అడ్డుపడినట్టయింది. మళ్ళీ బుచ్చయ్యే అన్నాడు:

"కోటిగాడి మాటలు నమ్మి, నీ బ్రతుకంతా పాడుచేశాను. నువ్వు జైలు కెళ్ళిన మూడో నెలలోనే, వాడు దానితో యెటో లేచిపోయాడు. వెండి కంచం దొంగిలించింది వాడేనన్న సంగతి తరవాత తెలిసింది!"

రామిగాడు నిలువు గుడ్లేసి చూస్తున్నాడు. అందరితోపాటు మాణిక్యాం కూడా తను వెండి పళ్లెం దొంగిలించాడని పూర్తిగా నమ్మిందన్నమాట!

"ఒకసారి శిక్షపడ్డాక ఇక దానికి తిరుగులేదుకదా! అందుకే, ఏం చేయలేక వూరుకున్నాను, రా, తిరిగి పనిలోకి వచ్చేయ్. మణిక్యాంపోతే... మరోతి..."

రామిగాడు ఓ పిచ్చినవ్వు నవ్వాడు.

"కోటిగాడు దానికి మెలికల కడియాలు కొనిపెట్టుంటాడు. అది వాడితో లేచిపోయింది. నేను కష్టపడి దాచిన ముప్పైయారు రూపాయలూ... ఆరునెల్లు జైలూ..."

రామిగాడు జుట్టు పీక్కున్నాడు. బుచ్చయ్యగారికేసి, ఇంటికేసి శూన్యంగా చూశాడు.

"కోటిగాడు... మెలికల కడియాలు... మాణిక్యాం... అహహ్హా!"

ఒకటే నవ్వు. తిరిగి తిరిగి అవే మాటలు. దగ్గిరకొచ్చి బుజంమీద చేయివేసిన బుచ్చయ్యని తొలగతోసుకుని, విల్లునుంచి వెలువడిన బాణంలా రామిగాడు అక్కడినుంచి పరిగెత్తాడు.

(ఆంధ్రజ్యోతి మాసపత్రిక - 1954)